క్లుప్తంగా

ఎమ్మెల్యే చెవిరెడ్డికి సత్కారం



చంద్రగిరి: జగనన్న సచివాలయం, గృహసారథుల మండల కన్వీనర్‌గా నూతనంగా నియమితులైన మాజీ ఎంపీటీసీ సభ్యులు సీఎం కేశవులు(బుజ్జి) మంగళవారం ఎమ్మెల్యే చెవిరెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయనను ఎమ్మెల్యే చెవిరెడ్డి శాలువతో సత్కరించి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని సూచించారు.

రూ.50 వేలు విరాళం



విరాళదాత గుణశేఖర్ శెట్టిని సత్కరిస్తున్న ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారి ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సుమారు రూ.3.5 కోట్లతో ఆలయ పునర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక చంద్రగిరి పాతపేటకు చెందిన గాదంశెట్టి గుణశేఖర్ శెట్టి రూ.50,116ను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి విరాళంగా అందజేశారు. ఆలయ ఈఓ రామకృష్ణారెడ్డి, కోలా మల్లికార్జున, వేమారెడ్డి, పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురికి జైలు

తిరుపతి లీగల్ : సెల్‌ఫోన్‌ను అపహరించిన కేసులో నలుగురికి రెండు నెలలు జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.100లు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి జీవకోన సత్యనారాయణపురానికి చెందిన ప్రియారమేష్, తమిళనాడు ఏలూరు జిల్లా గుడియాత్తం తాలూకా తట్టపర్రై గ్రామానికి చెందిన ఎస్.వెంకటేశన్, అరియలూరు జిల్లా కామరాజ్ నగర్‌కు చెందిన కె.రాజ, కడలూరు జిల్లా చిదంబరానికి చెందిన ఎస్.సతీష్‌కుమార్ ఈ ఏడాది జనవరి 31వతేది తిరుమల సీఆర్వో ఆఫీస్ వెయిటింగ్ హాల్ వద్ద చార్జింగ్ పెట్టిన ఓ సెల్‌ఫోన్‌ను అపహరించారు. సెల్‌ఫోన్ యజమాని ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు నలుగురిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నలుగురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి రూరల్ చెర్లోపల్లికి చెందిన కె.మురళీకృష్ణకు ఆరునెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి రూరల్ పుదిపట్లకు చెందిన బి.మోహన్‌కుమార్ వద్ద మురళీకృష్ణ 2013 ఫిబ్రవరి 16వ తేదీ రూ.3లక్షలు అప్పుగా తీసుకుని నోట్ రాసి ఇచ్చాడు. అలాగే అదే ఏడాది నవంబర్ 28న మరో రూ.7 లక్షలను అప్పుగా తీసుకున్నాడు. దీనికి మరొకరితో కలసి మురళీకృష్ణ తన ఆస్తిపత్రాలను సెక్యూరిటీ కింద మోహన్‌కుమార్‌కు ఇచ్చాడు. అప్పుగా తీసుకున్న సొమ్మును చెల్లించే క్రమంలో 2013 డిసెంబర్ 31న రూ.10లక్షల చెక్కును మురళీకృష్ణ రుణదాత మోహన్‌కుమార్‌కు ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీనిపై మోహన్‌కుమార్ కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి మురళీకృష్ణకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వ్యభిచారం కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్ : వ్యభిచారం నిర్వహిస్తున్న కేసులో ఇద్దరికి ఈనెల 14వతేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీచేశారు. తిరుపతి ఈస్టు సీఐ శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది ఫిబ్రవరి 27న భవానీనగర్‌లో ఓ ఇంటిని తనిఖీ చేశారు. ఆ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న తిరుపతి భవానీనగర్‌కు చెందిన ఎస్.మైలి, తిరుపతిలోని స్కావెంజర్స్ కాలనీకి చెందిన పాలూరు మోహన్‌లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వీరికి రిమాండ్ విధించారు.

ఆత్మవిశ్వాసంతో పని చేస్తే రాణిస్తాం

తిరుపతి ఎడ్యుకేషన్ : మహిళా వర్సిటీలో మంగళవారం 36వ జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని 'మహిళా పారిశ్రామికవేత్తలు–సవాళ్లు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహిళా పారిశ్రామికవేత్త మాధవి విప్పులంచ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా టీకప్పులు, మొక్కజొన్న పిండితో చేసిన జ్యూస్ గ్లాసులు, ఆహార నిల్వ పెట్టెలు, ఆకులతో తయారుచేసిన డిన్నర్ ప్లేట్లు వంటి వివిధ రకాల బయోడిగ్రేడబుల్ టేబుల్ వేర్‌లను ఆమె ప్రదర్శించారు. ఐపీటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయతకు మూలం సైన్స్

- ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ నమూనాలు



కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో ..

చంద్రగిరి: శాస్త్రీయకు మూలంగా విజ్ఞాన ప్రదర్శన నిలుస్తోందని ఎంఈఓ లలిత కుమారి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఏ.రంగంపేట, తొండవాడ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎంలు వెంకటనారాయణ చౌదరి, మదన్‌మోహన్, కోదండ రామ నాయుడు, సుజాత పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: విద్యార్థులు సైన్స్ ప్రయోగాలపై మక్కువ చూపాలని ఎంఈఓ వెంకటసుబ్బమ్మ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లావారిపల్లి పాఠశాలలో, కుప్పంబాదూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సైన్సు ప్రయోగాలను ఆమె పరిశీలించారు.

భాకరాపేటలో..

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో ఉన్న స్థానిక గీతాంజలి పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు సైన్స్ నమూనాలను, ఫుడ్ స్టాళ్లను ప్రదర్శించారు.

పాకాలలో..

పాకాల : మండలంలోని అన్ని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ బాబ్జీ అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. నేటి సమాజంలో సైన్స్ పాత్ర చాలా కీలకమని, రోజురోజుకు పెరుగుతున్న టెక్నాలజీకి సైన్స్ ప్రధానమని విద్యార్థులకు సూచించారు.

పలు స్కూళ్లలో..

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో సైన్సు ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దైనందిన జీవితంలో సైన్సు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలని సైన్స్ ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.



చంద్రగిరి: విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈఓ లలిత కుమారి



పాకాల: విద్యార్థులు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జీ



విశ్వం పాఠశాలలో..



రెడ్‌చెర్రీస్ పాఠశాలలో..



పరసాలవీధి నగరపాలక ప్రాథమిక పాఠశాలలో..



శేషాచల హైస్కూల్లో..



శ్రీచైతన్య పాఠశాలలో..



భాష్యం పాఠశాలలో..

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి

తిరుపతి లీగల్ : శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్‌జడ్జిగా జోరుపల్లి కృష్ణప్రియ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఆమెను ఇటీవలే కొత్తగా జూనియర్ సివిల్‌జడ్జిగా రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసి మొట్టమొదటిసారిగా శ్రీకాళహస్తి జూనియర్ సివిల్‌జడ్జిగా నియమించింది.

ఎస్వీసీసీ విద్యార్థుల ప్రతిభ



ఐ.లాస్య



పి.త్రివేణి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ ద్వితీయ సంవత్సర 4వ సెమిస్టర్ ఫలితాల్లో బీకామ్ కంప్యూటర్స్, బీఎస్సీ ఎంఎస్‌సీఎస్ విభాగాల్లో ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. బీకామ్ కంప్యూటర్స్‌లో ఐ.లాస్య 8.46, పి.త్రివేణి 7.48, యు.జగదీష్ 7.37, బీఎస్సీ ఎంఎస్‌సీఎస్‌లో యు.వినోద్‌కుమార్ 6.99 శాతం మార్కులు సాధించారు. మొత్తం 83 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

పాకాల : స్థానిక ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో హుండీ కానుకలను లెక్కించగా రూ.35,304 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జాతిని జాగృతం చేసేది నాటకం



కేకలతూరి కృష్ణయ్య దంపతులను సత్కరిస్తున్న ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతిని జాగృతం చేసేది జాతి జీవనాన్ని ప్రతిబింబింపజేసేది నాటకం అని, అందుకే ఏ పని అయినా, వృత్తయినా శ్రద్ధతో చేస్తే మనం రాణించగలమని హైదరాబాదుకు చెందిన రచయిత కేకలతూరి కృష్ణయ్య తెలిపారు. మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కేకలతూరి కృష్ణయ్య ధర్మనిధి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తాను రచించిన '' పిల్లల పెంపకం పెద్దల బాధ్యత'' అనే పుస్తక రచనా నేపథ్యాన్ని వివరించారు. ప్రముఖ వక్త కందిమళ్ల సాంబశివరావు హాజరై ''ఆధునిక తెలుగు నాటకం వైజ్ఞానిక అంశాలు'' అనే అంశంపై మాట్లాడారు. ప్రొఫెసర్ కాకాని సుధాకర్ ''ఆధునిక తెలుగు కవితం–వైజ్ఞానికాంశాలు'' అనే అంశంపై మాట్లాడుతూ చీకటిలో వెలుగును చూపించేది విజ్ఞానం అన్నారు. మరో వక్త నీలకంఠయ్య ''ఆధునిక తెలుగు కథానిక వైజ్ఞానికాంశాలు'' అనే అంశంపై మాట్లాడారు. తెలుగు విభాగాధిపతి, పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు కేకలతూరి కృష్ణయ్య రూ.5 లక్షలను ధర్మనిధి అందజేశారని, ఈ నేపథ్యంలో ఏటా ఫిబ్రవరి 28న సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం రచయిత కేకలతూరి కృష్ణయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీప్రియ, డాక్టర్ యువశ్రీ, డాక్టర్ వై.సుభాషిణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాజకీయ అజ్ఞాని లోకేష్



మాట్లాడుతున్న కట్టా గోపియాదవ్

తిరుపతి కల్చరల్: ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే సన్నిధి గొల్లను వంశపారంపర్యం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కట్టా గోపియాదవ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు అభివృద్ధి గురించి ఆలోచించని మీరు, నిత్యం ప్రజల కోసం పరితపించే ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గురించి, బీసీల గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. దొడ్డిదారిన ఎమ్మెల్సీ అయి మంత్రి పదవి పొందిన పులికేసి లోకేష్ వాస్తవాలను తెలుసుకోకుండా అజ్ఞానంతో విమర్శలు చేయడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు.బీసీలను అణిచివేసిన తెలుగుదేశం పార్టీ నామరూపాలు లేకుండా చేయడానికి యాదవులంతా కంకణబద్ధులై ఉన్నారని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసు యాదవ్, స్థానిక నేతలు శివప్రసాద్ యాదవ్, వినోద్ యాదవ్, అనిల్ యాదవ్, నితిన్ యాదవ్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

కోడ్ నిబంధనల మేరకు మండలమీట్



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రమేష్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడం వల్ల ప్రజాప్రతినిధులు ఎలాంటి అంశాలపై చర్చించడం గానీ, ప్రతిపాదనలు చేయడం వంటివి చేయకూడదని సూచించారు. సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారుల వద్ద హాజరు తీసుకుని సమావేశం ముగించారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, వైస్ ఎంపీపీ నాగూర్ బీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అభినవ అన్నమయ్య బాలకృష్ణప్రసాద్



బాలకృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్న శిష్యులు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆస్థాన విద్వాంసులుగా, ప్రముఖ వాగ్గేయకారుడిగా పేరొందిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ అభినవ అన్నమయ్యగా సంగీత ప్రియుల మదిలో ముద్ర వేసుకున్నారని పలువురు వక్తలు కొనియాడారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న సందర్భంగా వారి శిష్యులు మంగళవారం తిరుపతిలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు నిలయ విద్వాంసుడు మధుసూధనరావు, ఎస్వీ సంగీత కళాశాల వయోలిన్ విభాగాధిపతి డాక్టర్ కెవీ కృష్ణ, అమెరికాకు చెందిన ప్రముఖ నాట్య కళాకారిణి శ్రీవాణి, కళాకారులు శ్రీదేవి, బి.రఘునాథ్, ఎస్వీ సంగీత కళాశాల వేణువు విభాగాధిపతి డాక్టర్ ఎం.అనంతకృష్ణ, మృదంగ అధ్యాపకులు కోటిపల్లి రమేష్, పారుపల్లి బాలసుబ్రమణ్యం, శివసుబ్రమణ్యం, ఉదయభాస్కర్, సరస్వతీప్రసాద్, బీకే.భరద్వాజ, ఎస్వీబీసీ ప్రొడ్యూసర్లు భాస్కర్, భరద్వాజ పాల్గొన్నారు.

వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడికి అభినందనలు



ఉపేంద్రరెడ్డిని సన్మానిస్తున్న తిరుపతి రూరల్ మండల సర్పంచ్‌లు

తిరుపతి రూరల్ : వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ (వైఎస్సార్ టీయూసీ) తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రారెడ్డిని తిరుపతి రూరల్ మండల సర్పంచ్‌లు అభినందించారు. మంగళవారం మల్లంగుంటలో ఆయనకు పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీసెల్వం, సీవీ రమణ, కోటేశ్వరరావు, జానకిరామచంద్రయ్య, రాజ, ఎంపీటీసీ హేమాద్రి, మధుసూదన్‌రెడ్డి, మురళి, మధు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రాన్స్‌కో సీఎండీ



కలెక్టర్ వెంకటరమణారెడ్డితో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో సీఎండీ శ్రీధర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలో ట్రాన్స్‌కో సీఎండీ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు డి.శ్రీధర్ మంగళవారం కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించుకున్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో కరెంట్ కోతలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ వారికి వివరించారు. సీఎండీతో పాటు విద్యుత్ శాఖకు చెందిన పలువురు అధికారులు హాజరయ్యారు.

22ఎ పాపం టీడీపీదే



మాట్లాడుతున్న రమేష్‌రాయల్

తిరుపతి తుడా : తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో సర్వే నంబర్ల వారీగా రిజిస్ట్రేషన్లను బ్యాన్ చేసి ప్రజల కడుపు కొట్టిన చరిత్ర టీడీపీదేనని 45వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ అనీష్‌కుమార్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన స్థానికులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ స్థానిక నేతలు కుట్రపూరితంగా వ్యవహరించి 2018లో శివజ్యోతినగర్, ఎర్రమిట్ట, అయ్యప్పకాలనీ, రాజన్నపార్కు, సరోజినీదేవి రోడ్డు, డీబీఆర్ రోడ్లల్లోని పలు సర్వేనంబర్లపై బ్యాన్ విధించారన్నారు. దీనిపై శివజ్యోతినగర్ వాసుల వినతి మేరకు స్పందించిన ఎమ్మెల్యే భూమన రెవెన్యూ అధికారులతో పలుమార్లు చర్చించి ఆ ప్రాంత పరిధిలోని సర్వేనంబర్లు 95 నుంచి 701 వరకు మొత్తం 16.01 ఎకరాలపై ఉన్న 22ఎను తొలగించేలా చర్యలు తీసుకున్నారన్నారు. సమావేశంలో స్థానికులు వర్మ, వాసు, నరసింహులు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీలోకి జిల్లా నేతలు

తిరుపతి కల్చరల్: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీలోకి ఆ సంఘం జిల్లానేతలకు అవకాశం దక్కింది. ఈనెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన ఐఎఫ్‌టీయూ 9వ రాష్ట్ర మహాసభ నేపథ్యంలో ఆ సంఘం నేతలు రాష్ట్ర నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇందులో తిరుపతికి చెందిన జిల్లా నాయకులు రాయపనేని హరికృష్ణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, సహాయ కార్యదర్శిగా గుడ్లూరు భారతి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా కొత్తపల్లి సుబ్రమణ్యం, జె.గంగాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఐఎఫ్‌టీయూ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సుబ్రమణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కల్యాణ వెంకన్న సేవలో శ్రీశైలం ఈఓ లవన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారిని శ్రీశైలం ఆలయ ఈఓ లవన్న కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ వెంకటస్వామి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేయగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో జమేదారు చిరంజీవులు, సిబ్బంది పాల్గొన్నారు.

దిగివచ్చిన డీఎం



డీఎం బాలాజీతో ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ఆయన తీరుతో ఓ వైపు ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని.. మరోవైపు ఉద్యోగులకు నష్టం వాటిల్లుతోందని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు రెండు నెలలుగా గళమెత్తారు. ఫిబ్రవరి 27 నుంచి దీక్ష చేయాలని భావించారు. అయితే చర్చలకు ఆహ్వానించడం.. ఆపై సమస్యలు పరిష్కరించకపోవడంతో మార్చి 1వ తేదీ నుంచి నిరవధిక నిరాహారదీక్షకు పూనుకున్నారు. ఈ నేపథ్యంలో డీఎం ఉద్యోగులతో చర్చించారు. మార్చి 1 నుంచి సమస్యలు పరిష్కరిస్తామని అంగీకరించారు. ఇందులో తిరుమల ఘాట్‌లో ఆర్టీసీ డ్రైవర్లకు టిమ్ మిషన్ల రద్దు, 57 ఏళ్లు దాటిన డ్రైవర్లకు పల్లె వెలుగు డ్యూటీలు, లాంగ్ జర్నీలు రద్దు, సీనియార్టీ ప్రకారం డ్యూటీ చార్ట్‌లను ఏర్పాటు చేయడానికి అంగీకారం, ఏడీసీలకు స్థానచలనం, ఏడుకొండల బస్టాండ్‌లో అనౌన్స్‌మెంట్ చేస్తున్న ఉద్యోగులకు పాత పద్ధతుల్లో డ్యూటీలకు అంగీకరం తెలిపినట్టు అసోసియేషన్ నేతలు అర్జున్, తులసీరెడ్డి, రాంబాబు, షణ్ముగం, నరసింహా తెలిపారు.

సీఐఐ తిరుపతి జోన్ చైర్మన్‌గా ప్రియ మంజరి



వార్షిక సమావేశంలో పాల్గొన్న సీఐఐ చైర్మన్ నీరజ్ సార్దా, తిరుపతి జోన్ చైర్మన్, వైస్ చైర్మన్

తిరుచానూరు(చంద్రగిరి): భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) వార్షిక సమావేశాన్ని తిరుచానూరులోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24గాను సీఐఐ తిరుపతి జోన్ నూతన కార్యవర్గసభ్యులను సీఐఐ చైర్మన్ నీరజ్ సార్దా ప్రకటించారు. తిరుపతి జోన్ చైర్మన్‌గా ప్రియమంజరి తోడి, వైస్ చైర్మన్‌గా పుష్పిత్ గార్గ్‌ను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. వీరు ఏడాది పాటు కొనసాగనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పరిశ్రమల అభివృద్ధి, ఉత్పత్తిని మరింత మెరుగుపర్చేందుకు ఈ జోన్ చైర్మన్లు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ది స్ట్రాటజిస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు, అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి , కియా ఇండియా ప్రైవేటు లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ సీబీ పాటిల్ తదితరులు ప్రసంగించారు. సీఐఐ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్, సీఐఐ రాష్ట్ర హెడ్ శ్రీనివాస్ సతీష్ పాల్గొన్నారు.

బీసీలను దగా చేసింది టీడీపీనే



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

తిరుపతి కల్చరల్: స్వార్థ రాజకీయాలతో బీసీలను వాడుకుని అధికారంలోకి రాగానే బీసీలను దగా చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని వైఎస్సార్‌సీపీ యువిజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్, టౌన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ వాసు యాదవ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఇమ్రాన్ విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ వెన్నుపోటుదారు చంద్రబాబేనన్నారు. రాష్ట్రానికే తిరుపతి నగరాన్ని తలమానికంగా తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై నిందారోపణలు చేయడం విడ్డూరమన్నారు. దొడ్డిదారిలో మంత్రి అయిన లోకేష్‌కు తిరుపతి అభివృద్ధి కనిపించకపోవడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, వంశీ, దినేష్ సాయి, పసుపులేటి సురేష్, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇన్ఫెక్షన్ సోకకుండా మాస్కులు ధరించండి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కృష్ణప్రశాంతి

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు తలనీలాలు తీసేటప్పుడు ఇన్‌ఫెక్షన్ సోకకుండా క్షురకులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని తిరుపతికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కృష్ణ ప్రశాంతి సూచించారు. తిరుమల ఆస్థాన మండపంలో మంగళవారం కల్యాణకట్ట క్షురకులకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షురకులు భక్తులకు చాలా దగ్గరగా సేవలందిస్తారని, అందువల్ల మాస్కులు ధరించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ప్రధానంగా ఊపిరితిత్తులు, వెంట్రుకలు, ముక్కులకు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. వీటిని నివారించేందుకు లోషన్‌తో ఎప్పటికప్పుడు చేతులను శుభ్రం చేసుకోవాలని, చేతులకు తడి లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎక్కువసేపు కూర్చొని పని చేస్తుంటారని, అందువల్ల గంటకోసారి కాసేపు లేచి నడవాలని చెప్పారు. తరచూ మెడ, భుజాలకు సంబంధించిన వ్యాయామాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్వేత సంచాలకులు ప్రశాంతి, ఏఈఓ రమాకాంతరావు, 300 మందికి పైగా కల్యాణకట్ట క్షురకులు పాల్గొన్నారు.